క్లుప్తంగా

చీరాల కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి

చీరాల: చీరాల కేంద్రంగా బాపట్ల జిల్లా ఏర్పాటు చేయాలని చీరాల కేంద్ర జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం వెలగపూడి సచివాలయంలో మంత్రుల కమిటీకి వినతి పత్రం అందించారు. స్వాతంత్రోద్యమంలో చీరాలకు జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిన చీరాల, పేరాల ఉద్యమ సారథి ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పేరును బాపట్ల జిల్లాకు పెట్టాలని కోరారు. లేకపోతే చీరాల-బాపట్ల మధ్యలో ప్రభుత్వ పరిపాలన భవనాల, ఇతర ప్రభుత్వ శాఖల కార్యాలయాలను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చీరాల కేంద్ర జిల్లా సాధన సమితి కన్వీనర్ తాడివలస దేవరాజు, పట్టెం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అధివాస హోమాలు

అద్దంకి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండపై నున్న లక్ష్మీ నరసింహస్వామి కలశ పునఃప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. దానిలో భాగంగా ఆలయ అర్చకులు అధివామ హోమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాస్తు శుద్ధి అధివాస హోమాలు నిర్వహించారు. ఈహోమ కార్యక్రమంలో కోనేటి అనీల్ కుమార్ దంపతులు, కోనేటి శేఖర్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నేడు కలశ పునఃప్రతిష్ఠ కార్రృక్రమం వైభవంగా నిర్వహించనున్నారు.

నీటి నిల్వలేకుండా చూడాలి

అద్దంకి: వాయుగుండ ప్రభావంతో మొక్కజొన్న పొలాల్లో నీరు నిలవకుండా చూసుకోవాలని మండల వ్యవసాయాధికారి కొ్రపాటి వెంకట కృష్ణ రైతులతో చెప్పారు. ఆయన బుధవారం మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. 30 రోజుల్లోపు వయసు ఉన్న పొలాల్లో నీరు నిల్వ ఉంటే పైరు ఉరక వేస్తుందని చెప్పారు.


చెరువులా మారిన ఈపురుపాలెం-బాపట్ల ప్రధాన రహదారి


కారంచేడు-పర్చూరు రోడ్డులో నీట మునిగిన వరి చేలు


చీరాలలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం

దంచికొడుతున్న వానలు

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- చెరువులను తలపిస్తున్న పొలాలు

కారంచేడు: జిల్లాలో కారంచేడు మండలంలో వర్షాలు అధికంగా కురిశాయి. మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలతో రహదారులు జలమయంగా మారాయి. మండల కేంద్రం కారంచేడు ప్రధాన రహదారిగా ఉన్న సినిమాహాలు రోడ్డులో మోకాలికిపైగా నీరు నిలిచిపోయింది. దీంతో పాదచారులతో పాటు, సైకిల్, ద్విచక్రవాహనాలపై వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బుధవారం ఉదయం కొంత ఉపసమనం కలిగినా మరలా మధ్యాహ్నం నుంచి వర్షం మొదలైంది. కారంచేడుతో పాటు, మండలంలోని అన్ని గ్రామాల్లోను అత్యధికంగా వర్షపాతం నమోదైంది. ఎన్టీఆర్ నగర్, ఎస్టీ కాలనీ, ఎస్సీ కాలనీ, పుట్టాయిపాలెం, కాలువ సెంటర్, చినవంతెన సెంటర్ ప్రాంతాలలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గత రెండు రోజుల నుంచి ప్రారంభించిన ఎద పద్ధతిలో వరి నాటుతున్న రైతులకు ఈ వర్షం అడ్డంకిగా మారింది. నార్లు పోసేందుకు పొలాలు సిద్ధపరచుకున్న రైతులు మరో 10 రోజుల పాటు సాగుకు విరామం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జోరు వాన.. రోడ్లన్నీ జలమయం.

చీరాల టౌన్: బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో గ్రామాల్లోని అంతర్గత రోడ్లుతో పాటుగా ప్రధాన రహదారులు సైతం వర్షపు నీటితో నిండి ప్రజలు, వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మండలంలోని ప్రధాన రహదారులన్నీ వర్షం ధాటికి చెరువులుగా మారుతున్నాయి. వర్షానికి మండలంలోని ప్రధాన రహదారులైన ఈపురుపాలెం, దేవాంగపురి గ్రామాల్లోని రహదారులన్నీ వర్షం నీటితో నిండిపోయాయి. మోస్తరు వర్షం కురిస్తే చీరాల-ఒంగోలు, చీరాల-గుంటూరు ప్రధాన రహదారుల్లో ప్రయాణించే వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. గత కొన్నేళ్లుగా ఈ ప్రధాన రహదారుల్లో వర్షాలు పడిన సమయంలో నీరు నిల్వ చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కాని సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రోడ్లపైకి మూడు అడుగుల మేర నిల్వ చేరడంతో రాకపోకలు సాగించడంతో తమ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు.


కారంచేడు-కుంకలమర్రు రోడ్డులో వ్యవసాయ భూములు


పంగులూరులో మినుము పంటకు ప్రాణం పోసిన వర్షం

వర్షంతో పంటలకు ఎంతో మేలు

జే.పంగులూరు: ప్రస్తుతం పడుతున్న వర్షంతో పంటలకు ఎంతో మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి డి సుబ్బారెడ్డి అన్నారు. మండల పరిధిలోని బుధవారం 40 మిమీ వర్ష పడినట్లు ఏఓ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు తీవ్ర వర్షాభావ పరిస్థితుల వలన ఎండుముఖం పట్టినవన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షం పంటలకు జీవ పోసినట్లే అన్నారు. మినుము, మొక్కజొన్న, పత్తి ఇతర పంటలకు ఇది ఎంతో మేలు అన్నారు. కొత్త పంటలు సాగు చేసుకునేందుకు ఎంతో ఉపయోగం అన్నారు. ప్రస్తుతం మండలంలో 1200 ఎకరాల్లో మినుము, 150 ఎకరాల్లో మొక్కజొన్న, 30 ఎకరాల్లో పత్తి సాగుచేసినట్లు ఏఓ సుబ్బారెడ్డి తెలిపారు.


మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి చిల్డ్రన్స్ పార్కు వద్ద నిలిచిన వర్షపు నీరు

వర్షంతో ఊపిరి పీల్చుకున్న రైతులు..

మార్టూరు: అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షపాతంతో మండలంలోని అన్ని రకాల పంటలకు ప్రయోజనం కలిగింది. గత రెండు నెలలుగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల వలన ఆందోళనలో ఉన్న రైతులకు ఈ వర్షంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయమై మార్టూరు మండల వ్యవసాయ అధికారి రామినేని లావణ్య మాట్లాడుతూ ఇప్పటివరకు కురిసిన వర్షంతో మినుము, కూరగాయలు, జూటు తదితర ఉద్యానవన పంటలకు సైతం అనుకూలంగా ఉందని అన్నారు. ఆగస్టు 15వ తేదీ నాటికి అవసరమైన వర్షపాతం ఇంకా మండలంలో నమోదు కాలేదని రైతులకు మరింతగా వర్షం అవసరం ఉందని అన్నారు. ప్రస్తుత వర్షపాతం వలన ఇప్పటివరకు రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని ఆమె తెలిపారు.

ఇంకొల్లు(చినగంజాం): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణితో గడచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా ఇంకొల్లు మండల పరిధిలో భారీగా వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మొదటి రోజు 17.8 మి.మీ నమోదు కాగా రెండో రోజు 90.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయన వివరించారు. గ్రామాల్లోని వీఆర్వోలు అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలపాలని సూచించారు. డీటీ లక్ష్మికుమారి పాల్గొన్నారు.

భారీ వర్షంతో చిత్తడిగా చీరాల..

చీరాల అర్బన్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చీరాల ప్రాంతం చిత్తడిగా మారింది. మంగళ, బుధవారాలు ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పట్టణంలోని ప్రధాన రోడ్లపై వర్షం నీరు నిలిచిపోయింది. మంగళవారం సాయంత్రం నుంచి వర్షం ఎడతెరపి లేకుండా కురుస్తుంది. పట్టణంలోని మసీదు సెంటర్, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పార్కు, పేరాల మార్కెట్, దర్బార్ రోడ్డు, ఎస్ఆర్‌పీఎం హైస్కూల్ రోడ్డు, మసీదు సెంటర్‌లో వర్షం నీరు మోకాలు లోతులో నిలిచింది. మురుగు కాలువలు నిండి రోడ్డుపై ప్రవహించాయి. వర్షం కారణంగా పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బుధవారం ఉదయం నుంచి వర్షం కురవగా ప్రధాన రోడ్లతో పాటు పలు లోతట్టు ప్రాంతాలు కూడా వర్షం నీటితో నిండిపోయాయి.

దేవికకు అండగా వైఎస్సార్ సీపీ

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన్‌రెడ్డి

చీరాల రూరల్: దివ్యాంగురాలైన పొదిలి దేవికకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన్‌రెడ్డి అన్నారు. కారంచేడు గ్రామానికి చెందిన యార్లగడ్డ శ్రీకృష్ణ అతని భార్య సుజాత చేతిలో అకారణంగా ఇనుపరాడ్డుతో దెబ్బలు తిని గాయాలపాలై చీరాల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు రజక సామాజిక వర్గానికి చెందిన దేవికను బుధవారం పార్టీ తరపున మధుసూదన్‌రెడ్డితో పాటు నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు పరామర్శించారు. బాధితురాలి వారు తల్లిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో ఇంత దారుణమైన ఘటన జరగడం ఇదే ప్రథమమని పేర్కొన్నారు. ఈ కూటమి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలకు ఏ మాత్రం న్యాయం జరగడం లేదన్నారు. ఆయా వర్గాల ప్రజలపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిత్యం దాడులకు తెగబడుతున్నారని, రాష్ట్రంలోని ఏదో ఒకచోట ఇటువంటి ఘాతుకాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూటమి నాయకులు హత్యలు, అత్యాచారాలను ప్రోత్సహిస్తూ ధృతరాష్ట్ర పాలనకు తెరలేపారని వారు దుయ్యబట్టారు. దేవికపై విచక్షణా రహితంగా దాడికి తెగబడిన వారిపై ఇప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఈ ప్రభుత్వం బీసీలకు ఎటువంటి గౌరవం ఇస్తుందో ప్రజలందరూ గమనిస్తునే ఉన్నారని వారు పేర్కొన్నారు. దేవికకు న్యాయం జరిగే వరకు పార్టీ తరపున అండగా ఉండి పోరాడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జువ్వా శివరాం ప్రసాద్, స్టేట్ యూత్ వింగ్ జాయింట్ సెక్రటరి ఉప్పలపాటి అనిల్ చౌదరి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య, స్టేట్ సోషల్ మీడియా వింగ్ జాయింట్ సెక్రటరీ బట్టు అనిల్‌కుమార్‌లు పాల్గొన్నారు.


చికిత్స పొందుతున్న బాధితురాలు దేవికను పరామర్శిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె, నాయకులు

జాతీయ జెండాలతో ర్యాలీ

అద్దంకి: ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని శింగరకొండ సమీపంలోని కట్టూరామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ అండ్‌పీజీ కళాశాలలో బుధవారం ఘనంగా జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ వీ మోహనరావు ఆధ్వర్యంలో, కళాశాల ఎన్ఎస్ఎస్, ఇన్‌క్లూజీవ్ సెంటర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దానిలో భాగంగా విద్యార్థులు జాతీయ జెండాలతో కళాశాల నుంచి శింగకొండపాలెం గ్రామం వరకు జై హింద్ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు.


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

జీవితంలో స్థిరపడే వరకు వివాహాలు వద్దు

బల్లికురవ: విద్యార్థులు చదువుకుని జీవితంలో స్థిరపడే వరకు వివాహాలు చేసుకోవద్దని ఐసీడీఎస్ సంతమాగులూరు సీడీపీవో డి. సుధ కోరారు. బుధవారం స్థానికి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని.. బాల్యవివాహాల చేసుకోం అని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. సుధాకర్, అధ్యాపకులు, సూపర్‌వైజర్ విజయనిర్మల పాల్గొన్నారు.


బల్లికురవ కళాశాలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి

చీరాల టౌన్: వర్షాలు అధికంగా కురుస్తున్నందున గ్రామ పంచాయితీల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్నీ గ్రామ పంచాయతీల కార్యదర్శులు అప్రతమత్తంగా ఉండాలని ఎంపీడీవో బి.శివన్నారాయణ సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో చీరాల మండల పరిధిలోని అన్నీ గ్రామ పంచాయతీలు, సచివాలయాల సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడతూ.. వర్షాలు అధికంగా కురిసినందున గ్రామ ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటుగా దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, నీటి నిల్వలు, చెత్తకుప్పలు లేకుండా చూడాలన్నారు. సైడుకాలువలు పూడిక తీయించి, ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించి గ్రామాల్లో సీజనల్ వ్యాదులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. మురుగునీటి కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, దోమలు వ్యాప్తి చెందకుడా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పలుగ్రామాల కార్యదర్శులు, సచివాలయాల సెక్రటరీలు ఉన్నారు.

బైకు దొంగతనంపై కేసు

అద్దంకి: మోటారు బైకు దొంగతనం కేసు నమోదైనట్లు సీఐ సుబ్బారాజు బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ధేనువకొండకు చెందిన గుంజి అంకమ్మ ఈ నెల 9వ తేదీన తన మోటారు బైకు తీసుకుని శింగరకొండలో పని చేసుకునేందుకు బయలుదేరాడు. ఈ క్రమలో అద్దంకి చరిన తరువాత బస్టాండు వద్ద టీ తాగడానికి దుకాణం వద్ద నిలిపాడు. ఇంతలో ఇద్దరు గుర్తు తెలియన వ్యక్తులు అంకమ్మరావు వద్దకు వచ్చి మాటలు కలిపారు. మమ్మల్ని భావానీ సెంటరు వరకు దిగబెట్టమని అడగడంతో వారిని అక్కడ వదిలేందుకు తీసుకెళ్లాడు. అక్కడ వారద్దరూ వైన్స్ లోపలికి రమ్మని పిలవడంతో వెళ్లాడు. కొంత సేపటికి, గుర్తు తెలియని వ్యక్తులో ఒకరు నీ బైకు కీ ఇవ్వు ఇప్పుడే వస్తామని చెప్పి తీసుకుని వెళ్లారు. ఎంతకీ రాకపోవడంతో, ఎక్కడైనా వారు తన మోటరు బైకును వదిలి వెళ్లి ఉండవచ్చని వెతికినా ఫలితం లేకపోవడంతో, బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అందరి సహకారంతో డ్రగ్స్ నిర్మూలన

చీరాల: యువతలో వేగంగా వ్యాపిస్తున్న డ్రగ్స్ మహమ్మారిపై ప్రభుత్వం, పోలీసులు, సామాజిక సంస్థలు కలిసి కఠిన చర్యలు ప్రారంభించాయని ఒన్‌టౌన్ సీఐ ఎస్.సుబ్బారావు అన్నారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక ఎస్‌వీఎస్ అండ్ ఎస్‌జెఆర్ కళ్యాణ మండపంలో డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగం వలన ఆరోగ్య, కుటుంబ, సామాజిక సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ సమస్యను అరికట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీసులు సరిహద్దు ప్రాంతాలు, విమానాశ్రయాలు, పోర్టులలో తనిఖీలు కఠినతరం చేశామన్నారు. డ్రగ్స్ స్మగ్లింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు విధిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన, సెమినార్లు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులచే డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శక్తి టీం చీరాల సబ్ డివిజన్ ఇన్‌చార్జి ఎస్సై హరిబాబు, కె.సుబ్బారావు, ఈగల్ టీం సభ్యులు సురేష్, శ్రీమేధావి కాలేజి విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ సుబ్బారావు

వృద్ధులు, దివ్యాంగుడికి ఆర్థిక సాయం

మార్టూరు: జీవిత చరమాంకంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వృద్ధ దంపతులతో పాటు రెండు కాళ్లు లేని దివ్యాంగునికి మార్టూరుకు చెందిన హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు బుధవారం తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. మార్టూరు విజయనగర్ కాలనీలో నివాసం ఉండే దివ్యాంగుడు అంబటి నాగేశ్వరరావు, చిమ్మిరిబండ గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన వృద్ధ దంపతులు దుడ్డు అంజయ్య పెద్దమ్మాయిలు ఆర్థిక ఇబ్బందులతో దుర్భర జీవనం సాగిస్తున్నారు. వీరి పరిస్థితి తెలుసుకున్న సంస్థ అధ్యక్షుడు పఠాన్ ఖాదర్ వలీ తమ బృందంతో కలిసి బాధితులకు రూ.10 వేల ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు స్థానికులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

మినీ స్టేడియం ఏర్పాటుకు స్థల పరిశీలన

బల్లికురవ: బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మినీ స్టేడియం ఏర్పాటుకు బుధవారం స్థల పరిశీలన చేశారు. కళాశాలకు దాతల సహకారంతో 11 ఎకరాల స్థలం సమకూరింది. స్థలంలో దక్షిణ భాగంలో భవనాల నిర్మాణం చేపట్టారు. తూర్పు పడమర ఉత్తర భాగంలో ప్రహరి లేనందున ఆక్రమణకు గురవుతుంది. స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మినీ స్టేడియం, ప్రహరీ నిర్మాణానికి రూ. 4 కోట్లు నిధులు మంజూరయ్యాయి. తహసీల్దార్ రవినాయక్, డీఈ అనిల్, సర్పంచ్ అంజిబాబు, స్థానిక నేతలు, గొట్టిపాటి లక్ష్మయ్య, పావులూరి ఏడుకొండలు నాగబోయిన శింగారావులు స్థలాన్ని పరిశీలించారు. స్టేడియం నిర్మాణానికి కావాల్సిన స్థలం అంచనాలు తయారు చేసి ఇస్తే ఉన్నత స్థాయి అధికారులకు ఆమోదానికి నివేదిస్తామని ప్రిన్సిపల్ కె. సుధాకర్ తెలిపారు.


స్టేడియం నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు

కుంకలమర్రు (కారంచేడు): వాతావరణ మార్పులను బట్టి సీజనల్‌గా వ్యాపించే అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కారంచేడు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ పృథ్వీరాజ్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని కుంకలమర్రు-2 సచివాలయం పరిధిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అంటు వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను ప్రతి ఒక్కరు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తా, చెదారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.